పత్రికాప్రకటన కాకినాడ సెప్టెంబరు 13, 2019.

ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు సహకారంతో బాలికలు, మహిళలపట్ల వేధింపులులేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. విద్యా సంస్థలలో బాలబాలికల రక్షణ మరియు భద్రత అనే అంశంపై శుక్రవారంనాడు కాకినాడ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్కు షాపులో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యా సంస్థలలో బాలికల రక్షణకు విద్యాశాఖ పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటుందని అన్నారు. కేవలం విద్యా సంస్థలలోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలలోను, పరిశ్రమలు, తదితర అన్నిచోట్ల మహిళలు వేధింపులకు గురవుతున్న మాట వాస్తవమని, ఇలా వేధించే పురుషులు అందరూ మానసిక వికలాంగులని వీరందరికి కౌన్సిలింగ్ ఇవ్వవలసిన అవసరం ఎంతైనా వుందని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలోనైనా విద్యార్థినులు వేధింపులకు గురైతే అందుకు బాధ్యులైన వారందరిపైనా విద్యా శాఖ కఠినంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి హెచ్చరిస్తూ ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలో తీసుకున్న చర్యలను మంత్రి వివరించారు. సంఘటనకు బాధ్యులైన వారేకాకుండా జరిగన సంఘటనపై చర్య తీసుకోకపోవడము కూడా నేరమని మంత్రి అన్నారు. విద్యా సంస్థలలో చదివే విద్యార్థినులు ఆత్మన్యూనతా భావం విడనాడి ముందుకు వచ్చి సమస్యను చెప్పగలిగే పరిస్థితి రావాలని మంత్రి సూచించారు. పాఠశాలల్లో గుడ్ టచ్, బేడ్ టచ్ కాకుండా డోంట్ టచ్ అనేది అమలు కావలసి వుందని మంత్రి అన్నారు. మహిళ గౌరవించబడినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి తెలియచేశారు. విద్యాశాఖలో అనేక పథకాలు బాలికల ప్రయోజనం నిమిత్తం అమలు చేయబడుతున్నాయని వీటి అన్నింటి సహకారంతో బాలికల రక్షణకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. బాలికలు, మహిళల సంరక్షణకు అనేక చట్టాలు అమలులో వున్నాయని, వీటిపై మహిళలు అవగాహన కలిగి వుండాలని మంత్రి సూచించారు. బాలికల పట్ల తల్లిదండ్రులు స్నేహితులు మాదిరిగా వ్యవహరించి వారి సమస్యలు చెప్పుకునే పరిస్థితి కల్పించాలని మంత్రి అన్నారు. మహిళలు ఆత్మగౌరవం పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. తల్లుల కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి అమ్మఒడి పేరున విద్యార్థులకు విద్యా ఖర్చులు నిమిత్తం సంవత్సరానికి 12 వేలు ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అన్నారు. రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ శ్రీమతి వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ అన్ని రంగాల్లోను మహిళల హక్కుల పరిరక్షణకు కమీషన్‌కు అనేక అధికారాలు ప్రభుత్వం కల్పించిందని తెలియచేశారు. మహిళా సమస్యలపై అధ్యయనం చేసి వాటి నివారణకు ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడంతోబాటు క్రింది స్థాయిలో అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామని ఛైర్‌పర్సన్ తెలియచేశారు. విద్యా సంస్థలలో 50 శాతం సమయం గడుపుతున్న విద్యార్థుల సంరక్షణ బాధ్యత ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలపైన, ఉపాధ్యాయులపైన వుందని ఛైర్‌పర్సన్ తెలియచేశారు. బాలికల రక్షణ విషయంలో ప్రభుత్వ ఆదేశాలు పాటించని విద్యా సంస్థలు, ఉపాధ్యాయులు ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాలని అన్నారు. జిల్లాలో 2014 నుండి ఇప్పటి వరకు మహిళలపై వేధింపులు, అత్యాచార కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని, వీటిని తగ్గించవలసిన అవసరం ఎంతైనా వుందని ఛైర్‌పర్సన్ తెలియచేశారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి విద్యా సంస్థలలో జరిగే సంఘటనలు పర్యవేక్షించాలని సూచించారు. బాలికలు, మహిళల రక్షణ పట్ల కేవలం పోలీసుశాఖ మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాలని ఆమె సూచించారు. బాలికలను వేధింపులకు గురిచేయకూడదనే మానసిక పరివర్తన అబ్బాయిలలో రావాలని ఆమె అన్నారు. శాసనమండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించడానికే గాని కొట్టడానికికాదని, అలాగే నాట్ టచ్‌కు ప్రాధ్యాన్యతా ఇవ్వాలని సూచించారు. సిలబస్‌లో ఇచ్చిన లైంగిక విద్యా బోధనపై ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ ఎంపి వంగా గీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని, మేనిఫెస్టోలో మహిళలకు సంబంధించి సూచించిన ప్రతీ అంశంపైన చట్టబద్ధత కల్పించిందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు విషయంలో విద్యార్థినులు అప్రమత్తంగా వుండాలని, నేరాలకు గురైతే పోలీసుశాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరు డి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థలలో బాలికల సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టరు-2 జి.రాజకుమారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. పాఠశాలల్లో జరిగే సంఘటనలకు ప్రధాన ఉపాధ్యాయలే బాధ్యత వహించాలని కలెక్టరు తెలియచేశారు. పాఠశాల స్థాయి నుండి కూడా తప్పు ఒప్పులపై  అవగాహన కల్పించాలని తద్వారా విద్యార్థుల ప్రవర్తనలో మార్పు రావాలని కలెక్టరు సూచించారు. బాలికలు, మహిళా సమస్యలను విన్నవించేందుకు రూపొందించిన అప్లికేషన్ ద్వారా సమస్యలు తెలియచేయాలని కలెక్టరు సూచించారు. మహిళలపైన, బాలికలపైన వేధింపులులేని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కలెక్టరు విజ్ఞప్తి చేశారు. ఈ వర్కుషాపునకు అధ్యక్షత వహించిన జాయింటు కలెక్టరు - 2 జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో బాలికలపై ఇటీవల జరిగిన సంఘటనలు దురదృష్టకరమని, ఇకముందు ఇటువంటివి పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యా పరంగా విద్యార్థినులు ఏ విధమైన సమస్యలు ఎదుర్కోకుండా విద్యా సంస్థల యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టాలని జేసీ -2 సూచించారు. ఈ వర్కుషాపులో చైల్డ్ వెల్ఫేర్ కమీషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బి.పద్మావతి మరియు మహిళా కమీషన్ డైరక్టర్ శ్రీమతి సూయిజ్ మహిళలు, బాలికల సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలు, మరియు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు, కాకినాడ ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, రాజమండ్రి ఎస్పీ షిమోషిబాజ్‌పేయి, కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ సుంకర పావని, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పిడి సుఖజీవన్‌బాబు, జిల్లా విద్యాశాఖధికారి ఎస్.అబ్రహం, ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనగావించి కార్యక్రమాన్నీ ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ ప్రయివేటు కళాశాలు, పాఠశాలలు, సాంకేతిక విద్యా సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

(సమాచార శాఖ చే జారీ)